జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | 18 | ఆగస్టు | 2026 ◆ పేజీలు : 8

# నేడు మణుగూరుకు మంత్రి వివేక్ వెంకటస్వామి

- అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లో విద్యార్థుల ప్రతిభ పరిశీలన..
- ఎలక్ట్రిక్ వాహనాలను పరిశీలించనున్న మంత్రి
- శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు అర్హత పత్రాల పంపిణీ



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఆగస్టు 17, ప్రజాజ్యోతి :** రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకట స్వామి మంగళవారం మణుగూరులో పర్యటించనున్నారు. ఉదయం హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి 11.30 గంటలకు మణుగూరుకు చేరుకోనున్నట్లు సమాచారం. అనంతరం అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లో నిర్వహించే కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారు. ఈ సందర్భంగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు రూపొందించిన ఎలక్ట్రిక్ వాహనాలను మంత్రి పరిశీలించనున్నారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన నమూనాలు, వాహనాల పనితీరును పరిశీలించి వారి ప్రతిభను తెలుసుకోనున్నారు. అనంతరం శిక్షణ పూర్తి

మిగతా 2 లో...




# నీట్-పీజీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేయాలి

- పరీక్ష కేంద్రంలో భద్రతా చర్యలు చేపట్టాలి
- అభ్యర్థుల గుర్తింపు, సీసీటీవీ, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 17,(ప్రజాజ్యోతి)** జిల్లాలో ఈ నెల 30న నిర్వహించనున్న నీట్–పీజీ–2026 పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి అవకతవకలకు, సాంకేతిక అంతరాయాలకు తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నీట్–పీజీ–2026 పరీక్ష ఈ నెల 30న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సుజాతనగర్‌లోని అబ్దుల్ కలాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నలాజికల్ సైన్సెస్‌లో నిర్వహించనున్నారు. జిల్లాలో ఇదే ఏకైక పరీక్షా కేంద్రం కాగా, మొత్తం 100 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారనీ తెలిపారు,
పరీక్షా కేంద్రం వద్ద పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, అభ్యర్థుల ఫ్రిస్కింగ్, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా, మాల్‌ప్రాక్టీస్ నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అభ్యర్థులు ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, ఆభరణాలు, వాటర్ బాటిల్లు, ఎటువంటి వస్తువులను పరీక్షా కేంద్రంలోనికి అనుమతించరాదని, నిశితంగా

మిగతా 2 లో...

# గోదావరి పుష్కరాల పనులను వేగవంతం చేయాలి



- ప్రతి జిల్లాకు ప్రత్యేక అధికారిని నియమించి పనులను వేగవంతం చేయాలి
- డిసెంబర్ నాటికి ఉత్తర ద్వార దర్శనం పనులతో పాటు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలి
- శ్రీరామనవమి నాటికి 90 శాతం పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి
- దేవాదాయ కమిషనర్ హనుమంతరావు

**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 17 ,(ప్రజా జ్యోతి)** గోదావరి పుష్కరాల సన్నద్ధతలో భాగంగా చేపడుతున్న అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని దేవాదాయ కమిషనర్ హనుమంతరావు

మిగతా 2 లో...

# పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఖమ్మం ఎంపీ రఘురామి రెడ్డి, ఎమ్మెల్యే జారె

- యర్రగుంట, రామకృష్ణాపురంలో సీసీ రోడ్ల ప్రారంభం
- మర్రిగూడెంలో డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన



**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 17 (ప్రజాజ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండలంలో సోమవారం ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామి రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ విస్తృతంగా పర్యటించారు. సుమారు రూ.40 లక్షల వ్యయంతో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా పూర్తయిన పనులను ప్రారంభించడంతో పాటు, చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. పర్యటనలో భాగంగా యర్రగుంట గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం మర్రిగూడెం గ్రామంలో

మిగతా 2 లో...

# అలియాస్ పేర్ల సమస్యకు కమిటీ

- నెల రోజుల్లో పరిష్కారం చూపాలి..
- దీక్షలు విరమించిన కార్మికుల వారసులు
- పరిష్కారం కాకుంటే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తాం: కూనంనేని




**కొత్తగూడెం, ఆగస్టు 17, ప్రజాజ్యోతి :** సింగరేణి సంస్థలో అలియాస్ పేర్లతో పనిచేసిన కార్మికుల వారసులు ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం చూపేందుకు యాజమాన్యం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసిందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. నెల రోజుల్లో సమస్యను అధ్యయనం చేసి పరిష్కార మార్గాన్ని చూపుతామని యాజమాన్యం హామీ ఇచ్చిందన్నారు. సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట అలియాస్ పేర్ల సమస్యపై కార్మికుల వారసులు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షలను సోమవారం కూనంనేని సాంబశివరావు, సింగరేణి పర్సనల్ జనరల్ మేనేజర్ కిరణ్ కుమార్ నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. గతంలో కార్మికులు అందుబాటులో లేని పరిస్థితుల్లో ఉద్యోగాల్లో చేరే

మిగతా 2 లో...

## నేడు మణుగూరుకు మంత్రి వివేక్ వెంకటస్వామి

(మొదటి పేజీ తరువాయి...)
చేసుకున్న విద్యార్థులకు అప్రెంటిస్‌షిప్, ఐటీసీ అర్హత పత్రాలను మంత్రి వివేక్ వెంకటస్వామి అందజేయనున్నారు. సాంకేతిక నైపుణ్యాల ద్వారా విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించే అంశంపై కార్యక్రమంలో దృష్టి సారించనున్నారు. మంత్రి పర్యటన నేపథ్యంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమం అనంతరం మంత్రి మణుగూరు నుంచి మంచిర్యాల జిల్లా చెన్నూరుకు బయలుదేరనున్నట్లు సమాచారం.

## అలియాస్ పేర్ల సమస్యకు కమిటీ

(మొదటి పేజీ తరువాయి...)
సమయంలో పేర్లలో వ్యత్యాసాలు చోటుచేసుకున్నాయని తెలిపారు. అప్పట్లో సింగరేణి యాజమాన్యం సమక్షంలోనే ఉద్యోగాలు కొనసాగినప్పటికీ, ప్రస్తుతం అదే పేర్ల వ్యత్యాసాలను కారణంగా చూపుతూ వారి వారసులకు కారుణ్య నియామకాలు నిలిచిపోవడం ఆందోళన కలిగించే అంశమన్నారు. విజిలెన్స్ విచారణల కారణంగా వారసులకు ఉద్యోగాలు లభించకపోవడంతో వారు తీవ్ర మానసిక ఆవేదనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యపై కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేల సమావేశంలో సింగరేణి యాజమాన్యంతో చర్చించినట్లు తెలిపారు. దీంతో ముగ్గురు యాజమాన్య ప్రతినిధులు, ఇద్దరు ఏఐటీయూసీ ప్రతినిధులు, ఒక ఐఎన్‌టీయూసీ ప్రతినిధితో మొత్తం ఆరుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కమిటీ నెల రోజుల్లో సమస్యను పూర్తిగా అధ్యయనం చేసి పరిష్కార మార్గాన్ని సూచించాల్సి ఉంటుందని తెలిపారు. నెల రోజుల్లో సమస్య పరిష్కారం కాకపోతే కార్మికుల వారసులతో కలిసి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పరిష్కారానికి కృషి చేస్తామని కూనంనేని స్పష్టం చేశారు. అదేవిధంగా గతంలో వివిధ కారణాలతో డిస్మిస్ అయిన కార్మికుల సమస్యలను కూడా యాజమాన్యం మానవతా దృక్పథంతో పరిశీలించి న్యాయం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, యూనియన్ నాయకులు వంగ వెంకట్, జి.వీరాస్వామి, శేషయ్య, రమణమూర్తి, గట్టయ్య, కిష్టాఫర్, సందెబోయిన శ్రీనివాస్, మాతంగి లింగయ్య, బండారి మల్లయ్య, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఖమ్మం ఎంపీ రఘురామి రెడ్డి, ఎమ్మెల్యే జారె





(మొదటి పేజీ తరువాయి...)
మురుగునీటి సమస్య పరిష్కారానికి చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రామకృష్ణాపురం గ్రామంలో నూతనంగా పూర్తి చేసిన సీసీ రోడ్లను కూడా ప్రారంభించారు. మండలంలోని గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# నీట్-పీజీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)
పరిశీలించిన తర్వాతను మాత్రమే పరీక్షా కేంద్రంలోనికి అనుమతించాలని ఆదేశించారు. పరీక్షా సమయంలో నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి. పరీక్ష సమయాల్లో విద్యుత్ సరఫరాను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారిని అందుబాటులో ఉంచాలని సూచించారు. పరీక్షా కేంద్రంలో ఇంటర్నెట్, సీసీటీవీ కెమెరాలు తదితర సాంకేతిక సదుపాయాలు సక్రమంగా పనిచేసేలా ముందస్తుగా తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. సుజాతనగర్ తహసీల్దార్ పరీక్షా కేంద్రాన్ని ముందుగానే సందర్శించి ఫర్నిచర్, తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులను పరిశీలించి, లోటుపాట్లు ఉంటే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రం పరిసరాల్లో ఉదయం 8 గంటల నుంచి




మధ్యాహ్నం 1 గంట వరకు సెక్షన్ 163 అమలు చేయడంతో పాటు, సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను ఆ సమయంలో మూసి వేయించాలన్నారు, పరీక్ష సమయంలో తరచూ తనిఖీలు నిర్వహించాలని, అభ్యర్థులకు అత్యవసర వైద్య సహాయం అందించేందుకు పరీక్షా కేంద్రంలో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ప్రథమ చికిత్స కిట్లు, అవసరమైన మందులు, ఓఆర్ఎస్ తదితరాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. పరీక్షా కేంద్రంలో ఎలాంటి మాల్‌ప్రాక్టీస్, అవకతవకలకు అవకాశం లేకుండా సిట్టింగ్ స్క్వాడ్ నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. సుజాతనగర్ తహసీల్దార్ వి. కృష్ణ ప్రసాద్‌ను డ్యూటీ మేజిస్ట్రేట్‌గా నియమించారు. కొత్తగూడెం ఆర్డీఓ పరీక్షా కేంద్రాన్ని పర్యవేక్షిస్తూ పరీక్ష సమయంలో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు, పరీక్షా కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్‌గా అబ్దుల్ కలాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నలాజికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ బి. శ్రీకాంత్, అబ్జర్వర్‌గా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి హెచ్. వెంకటేశ్వరరావు విధులు నిర్వహిస్తారని, తెలిపారు . నీట్-పీజీ పరీక్ష విజయవంతంగా నిర్వహించేందుకు పోలీస్, రెవెన్యూ, విద్యుత్, వైద్య, విద్య, ఎన్ఐసీ తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డి ఆర్ వో పద్మావతి, కొత్తగూడెం ఆర్డీవో మధు, జిల్లా వైద్య శాఖ అధికారి తుకారాం రాథోడ్, జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, సుజాతనగర్ తాసిల్దార్ కృష్ణ ప్రసాద్, అబ్దుల్ కలాం కళాశాల ప్రిన్సిపల్ శ్రీకాంత్, పోలీస్ శాఖ అధికారులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాల పనులను వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)
సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి గోదావరి పరివాహక జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పుష్కరాల సన్నద్ధతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాదాయ కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన పనులను ఎలాంటి జాప్యం లేకుండా చేపట్టి పుష్కరాల నాటికి పూర్తి చేయాలని అన్నారు. దేవాదాయ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, విద్యుత్, పోలీస్, ఆర్అండ్‌బీ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాల వారీగా మంజూరైన పనుల పురోగతి, వివిధ అనుమతులు, ఎదురవుతున్న సమస్యలపై సమీక్షించి, అవసరమైన అనుమతులను త్వరితగతిన పొందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి జిల్లాకు ఒక ప్రత్యేక అధికారిని నియమించి దేవాలయాల అభివృద్ధి, పుష్కర పనులు, పర్యాటక అభివృద్ధి, భక్తులకు అవసరమైన మౌలిక వసతుల పనులను సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాలని అన్నారు.



జిల్లా కలెక్టర్లు ప్రతి వారం పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించాలని సూచించారు. పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు త్వరలో ప్రత్యేక యాప్‌ను రూపొందించనున్నట్లు, ప్రతి వారం పనుల వివరాలను యాప్‌లో అప్‌డేట్ చేయాలని తెలిపారు. భద్రా చలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అభివృద్ధి, ఆలయ పునర్నిర్మాణ పనులను వేగవంతం చేయాలని దేవాదాయ కమిషనర్ సూచించారు. డిసెంబర్ నాటికి ఉత్తర ద్వార దర్శనం పనులతో పాటు, ముక్కోటి ఏకాదశి సందర్భంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. శ్రీరామనవమి నాటికి 90 శాతం పనులు పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని, పుష్కరాల నాటికి ఆలయ అభివృద్ధి పనులు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా క్యాబినెట్ సబ్ కమిటీ తీసుకున్న నిర్ణయాలను దేవాదాయ కమిషనర్ వివరించారు. ఇరిగేషన్, దేవాదాయ, పంచాయతీరాజ్ శాఖల ద్వారా చేపడుతున్న శాశ్వత పనులతో పాటు చేపట్టనున్న తాత్కాలిక పనులపై సమీక్షించారు. భక్తులకు అవసరమైన మౌలిక వసతులు, భద్రత, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, రహదారులు, రాకపోకల ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.

ఐ డి ఓ సి కార్యాలయం సమావేశ మందిరం నుండి పాల్గొన్న జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ గోదావరి పుష్కరాల దృష్ట్యా జిల్లాలో చేపడుతున్న అన్ని పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకుంటామని తెలిపారు. భద్రాచలం దేవస్థానం అభివృద్ధి పనులు, భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తామని అన్నారు. డిసెంబర్‌లో ఉత్తర ద్వార దర్శనం, ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేస్తామని చెప్పారు. శ్రీరామనవమి నాటికి 90 శాతం పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని, పుష్కరాల నాటికి భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తామని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట, డిఆర్ఓ పద్మావతి, సిపిఓ సునీత, దేవస్థానం ఈవో దామోదర్ రావు, డిపిఓ అనూష, ఆర్ అండ్ బి ఈ ఈ నాగేశ్వరరావు, ఇరిగేషన్ శాఖ అధికారులు, పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ దాడి

**ములకలపల్లి, ఆగస్టు 17 (ప్రజాజ్యోతి):** మండలంలోని మూకమామిడి శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై సోమవారం టాస్క్ ఫోర్స్ సీఐ రమాకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.40 వేల నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలు, ఏడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



## కేజీబీవీలో అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

**ములకలపల్లి ఆగస్టు 17 (ప్రజాజ్యోతి):** మండలంలోని కేజీబీవీలో ఖాళీగా ఉన్న ఒక అసిస్టెంట్ కుక్ పోస్టును కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు ఎంఈఓ సత్యనారాయణ తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులకు వంట చేసిన అనుభవం ఉండాలి. వంట నైపుణ్యాన్ని కుకింగ్ డెమో ద్వారా పరిశీలిస్తారు. వయసు 18–45 ఏళ్లు ఉండాలి. అర్హులు ఈ నెల 20లోగా ములకలపల్లి ఎంఈఓ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

# 'ప్రజావాణి'కి విశేష స్పందన

- మండల సమస్యలపై వినతుల వెల్లువ..

- 24 శాఖల అధికారుల హాజరు



**బూర్గంపహాడ్, ఆగస్టు 17 (ప్రజా జ్యోతి):** బూర్గంపహాడ్ మండలంలో తొలిసారిగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మండల పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వినతి పత్రాలు సమర్పించారు.ప్రతి సోమవారం మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.నోడల్ ఆఫీసర్, ఎంపీడీవో కుడుముల జమలారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మండలంలోని 24 శాఖలకు చెందిన మండలస్థాయి అధికారులు హాజరయ్యారు. దీంతో తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు వచ్చిన ప్రజలకు ఒకే వేదికపై వివిధ శాఖల అధికారులను కలిసి వినతులు అందించే అవకాశం కలిగింది.గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు పంచాయతీల పరిధిలో నెలకొన్న సమస్యలు, మౌలిక సదుపాయాల కొరత, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, వ్యక్తిగత సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

**– ఇందిరమ్మ ఇళ్లు.. పెన్షన్లపై అధికంగా వినతులు**

ప్రజావాణిలో ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్లు, వివిధ రకాల పెన్షన్లు, పారిశుద్ధ్యం, ఉచిత విద్యుత్, చేయూత పింఛన్లు తదితర సమస్యలపై ప్రజలు వినతులు సమర్పించారు.మండలవ్యాప్తంగా మొత్తం 25మంది తమ సమస్యలపై దరఖాస్తులను అధికారులకు అందజేశారు.అధికారులు ఆయా వినతులను స్వీకరించి సంబంధిత శాఖలకు పంపిస్తూ సమస్యలను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావడానికి ప్రజావాణి మంచి వేదికగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.

**–పల్లె ప్రకృతివనానికి తాళాలు.. కబ్జా భయం**

బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని పల్లె ప్రకృతివనం నిర్వహణపై ప్రజావాణిలో ఫిర్యాదు వచ్చింది. పల్లె ప్రకృతి వనం చాలాకాలంగా మూసివేసి ఉండటంతో పాటు ప్రధాన గేటుకు తాళాలు వేసి ఉన్నాయని గ్రామ యువకుడు బబ్బురాయుడు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.పల్లె ప్రకృతివనం వద్దకు వెళ్లేందుకు సరైన దారి కూడా లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతివనం ఆక్రమణకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ విషయంపై వచ్చిన ఫిర్యాదుపై ఎంపీడీవో కుడుముల జమలారెడ్డి స్పందించారు.పల్లె ప్రకృతివనం గేటుకు వేసిన తాళాలను తొలగించేలా చర్యలు తీసుకోవడంతో పాటు అక్కడ పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.ప్రభుత్వ స్థలాలు, ప్రజా ప్రయోజనాల కోసం ఏర్పాటు చేసిన ఆస్తుల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా తమ సమస్యలను నేరుగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని అధికారులు తెలిపారు. ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కేఆర్కే ప్రసాద్, ఎస్సై మేడా ప్రసాద్, ఎంపీవో రామకృష్ణ, ఏవో శంకర్, పీఆర్ ఏఈ చక్రధరాచారి, హౌసింగ్ ఏఈ ఉదయ్ కిరణ్ తో పాటు వివిధ శాఖలకు చెందిన మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి వినతిని పరిశీలించి సంబంధిత శాఖల పరిధిలో సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టారు.

# సీసీటీఎన్ఎస్ 2.0, నాట్ గ్రిడ్, గాండీవ వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించాలి

-ఇల్లందు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా ఎస్పీ





**ఇల్లందు, ఆగస్ట్ 17 (ప్రజా జ్యోతి)** సీసీటీఎన్ఎస్ 2.0, నాట్ గ్రిడ్, గాండీవ వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. సోమవారం జిల్లా ఎస్పి రోహిత్ రాజు ఇల్లందు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన అనంతరం అధికారులు, సిబ్బందితో స్టేషన్‌లోని వివిధ విభాగాల పనితీరును సమీక్షించి పలు సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను బాధ్యతగా పరిష్కరించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకొని, పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.వర్టికల్స్ వారీగా విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి వారి పనితీరు, విధుల నిర్వహణ తీరును పరిశీలించారు. సీసీటీఎన్ఎస్ 2.0 వ్యవస్థను సమర్థవంతంగా వినియోగిస్తూ పోలీసు సేవలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా అందించాలని సూచించారు. సీఈఐఆర్ పోర్టల్ వినియోగంపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. అదేవిధంగా నాట్ గ్రిడ్, గాండీవ వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. స్టేషన్ పరిధిలోని సస్పెక్ట్ షీట్లు, రౌడీ షీట్లను నిరంతరం సమీక్షిస్తూ, సంబంధిత వ్యక్తుల కదలికలు, కార్యకలాపాలపై నిఘా కొనసాగించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలు సైబర్ మోసాల బారిన పడకుండా పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదులపై వేగంగా స్పందిస్తూ, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో నిరంతరం సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, డయల్-112కు ఫోన్ వచ్చిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని బాధితులకు అండగా నిలవాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకొని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు డీఎస్పీయు వెంకన్న బాబు, సీఐ తాటిపాముల సురేష్, ఎస్సైలు ఉమా, సారంగపాణి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కల్యాణలక్ష్మి&_షాదీ ముబారక్ పథకాల నిధులను లబ్ధిదారులకు అందజేయాలి

రెండు పథకాల నిధులను లబ్ధిదారులకు అందజేయాలని బిఆర్ఎస్ ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన



**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 17 ,(ప్రజా జ్యోతి)** కళ్యాణ లక్ష్మి __షాదీ ముబారక్ పథకాలకు సంబంధించిన నిధులను తెలంగాణ హైకోర్టు తాత్కాలికంగా నిలిపివేయడంతో బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమానికి ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మంతపురి రాజు గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కార్యాల మీదట నిరసన కార్యక్రమం చేపట్టారు, అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తాసిల్దార్ ధారా ప్రసాదుకు అందజేశారు, ఈ సందర్భంగా రాజ్ గౌడ్ మాట్లాడుతూ హైకోర్టు స్టే ఉత్తర్వులు చట్టబద్ధత లేదా అసెంబ్లీ తీర్మానం లేకుండా కేవలం జీవోల ద్వారా రూ.13,000కోట్లకు పైగా ప్రజాధనాన్ని ఖర్చు చేస్తున్నారంటూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ ధర్మాసనం, ఈ పథకాల అమలుపై సెప్టెంబర్ 9 వరకు తాత్కాలిక స్టే విధించింది అన్నారు , దీనిపై కౌంటర్ దాఖలు చేయని ప్రభుత్వం గతంలో కోర్టు ఆదేశించినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం సరైన సమయంలో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడం వల్లే ఈ స్టే ఆర్డర్ వచ్చిందన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే పేద ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆసరాగా నిలిచే ఈ పథకాలను రద్దు చేయడానికి కుట్ర పన్నుతోందని అన్నారు, ఇప్పటికైనా నిలిచిపోయిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ నిధులను దరఖాస్తులను వెంటనే క్లియర్ చేసి, లబ్ధిదారులకు న్యాయం చేయాలని రాజు గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం కార్పొరేషన్ కార్పొరేటర్లు సింధుతపస్వి, స్వప్న కుమారి ,గుణచరిత్, 38వ డివిజన్ కార్పొరేటర్ బత్తుల మధుచంద్,మల్లెల రవిచంద్ర,దాసరి సురేష్ యాదవ్, తెలంగాణ సురేష్,యాకూబ్,అఖిల్,వీరన్న,హర్ష,సునీల్,భట్టు నెహ్రూ, దాసరి లక్ష్మి, షరీఫ్, గౌతమ్, ప్రశాంత్,ఎస్టరు,స్వరూప ,గాలిబ్,నరసింహ పాల్గొన్నారు.

# పాల్వంచలో మండల స్థాయి ప్రజావాణి

23 వినతులు స్వీకరణ.

సత్వర పరిష్కారానికి అధికారులకు ఎమ్మెల్యే సూచనలు.



**పాల్వంచ, ఆగస్టు 17, ప్రజాజ్యోతి:** పాల్వంచ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు హాజరై ప్రజల నుంచి వివిధ సమస్యలపై ఫిర్యాదులు, వినతిపత్రాలను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు హాజరై ప్రజల సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా మొత్తం 23 మంది పిటిషనర్లు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలను సమర్పించారు. ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదును సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# ముస్లిం శ్మశానవాటికలో ఖననాలకు అనుమతి ఇవ్వాలి

**ప్రజావాణిలో ఎండి యాకుబ్ పాషా అధికారులకు వినతి**




**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 17 ,(ప్రజా జ్యోతి)** పట్టణంలోని ముస్లిం సమాజం ఎదుర్కొంటున్న శ్మశానవాటిక సమస్యను పరిష్కరించి, ఖననాలకు అనుమతి కల్పించాలని తెలంగాణ మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ యాకూబ్ పాషా అధికారులను కోరారు. సోమవారం పాల్వంచ ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజా ఫిర్యాదుల విభాగం ద్వారా నోడల్ ఆఫీసర్ కు వినతిపత్రం సమర్పించారు.పాల్వంచ పట్టణం కేఎస్పీ రోడ్డులోని సర్వే నంబర్ 708లో ముస్లిం శ్మశానవాటిక కోసం గతంలో రెవెన్యూ అధికారులు భూమిని కేటాయించారని, దానికి పట్టా పాస్‌బుక్ కూడా జారీ అయిందని తెలిపారు. తొలుత సుమారు 7.35 కుంటల భూమి కేటాయించగా, ఆక్రమణల కారణంగా ప్రస్తుతం సుమారు 2.25 కుంటల స్థలం మాత్రమే అందుబాటులో ఉందన్నారు.ఇందిరా కాలనీలోని ప్రస్తుత ముస్లిం శ్మశానవాటిక పూర్వీకుల సమాధులతో నిండిపోవడంతో కొత్తగా మృతదేహాల ఖననానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. సర్వే నంబర్ 708లో కేటాయించిన భూమిని ఆక్రమణల నుంచి రక్షించి, శ్మశానవాటికగా వినియోగించుకునేందుకు అధికారిక అనుమతులు మంజూరు చేయాలని కోరారు.రెవెన్యూ రికార్డులు, పట్టా పాస్‌బుక్‌ను పరిశీలించి, అవసరమైన స్థల తనిఖీ నిర్వహించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు ఈ సందర్భంగా సంబంధిత పత్రాల ప్రతులను అధికారులకు అందజేశారు. ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని యాకూబ్ పాషా వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు మాజిద్ ఖురేషీ, గౌస్ పాషా, కలీం, మజహర్, ఉస్మాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# నాగపంచమికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

- , , సుబ్రహ్మణ్య స్వామివారికి విశేష అభిషేకం.. భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం
- , , దోసపాటి రాంబాబు, భాగ్యలత కుటుంబీకుల ఆధ్వర్యంలో మహా అన్నదానం



**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 17 (ప్రజాజ్యోతి ):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల శ్రీ భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి దేవస్థానంలో సోమవారం నాగ పంచమి సందర్భంగా భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సుబ్రహ్మణ్య స్వామివారికి విశేష అభిషేకం, భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే గ్రామస్తులు, సుదూర ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం దోసపాటి రాంబాబు, భాగ్యలత కుటుంబీకుల ఆధ్వర్యంలో భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు స్వామివారి మహా ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ మేనేజర్ పీవీ రమణ పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

# ప్రజావాణి వినతులకు సత్వర పరిష్కారం చూపాలి

**ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి**

**ప్రజలకు చేరువగా ప్రజావాణి – మండలాల్లోనూ నిర్వహణ**

**జిల్లా కలెక్టర్ అంకిత్**



**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 17,(ప్రజాజ్యోతి )** సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులు, ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అతను కలెక్టర్ విద్యా చందన, డి ఆర్ వో పద్మావతి తో కలసి స్వీకరించారు. భూ సంబంధిత వివాదాలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, పెన్షన్లు, గృహాలు, మౌలిక వసతులు, సామాజిక భద్రత తదితర సమస్యలను ప్రజలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం ప్రభుత్వం కల్పించిన ముఖ్యమైన వేదిక అని అన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి వినతిని పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి ఎలాంటి అవకాశం ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖలకు వెంటనే పంపించాలని సూచించారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, క్లిష్టమైన సమస్యలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని మండలాల్లో కూడా ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. మండల స్థాయిలోనే ప్రజలు తమ సమస్యలు, వినతులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందే అవకాశం ఉందన్నారు. ప్రజలు తమకు సమీపంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలు తమ వినతులతో పాటు సమస్యకు సంబంధించిన అవసరమైన ఆధార పత్రాలను సమర్పిస్తే పరిష్కారం మరింత వేగంగా జరిగే అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు కొన్ని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 17వ డివిజన్‌లో నివాసం ఉంటున్న బానోత్ చంద్రమౌళి, తమ ప్రాంతంలోని రేషన్ షాపును స్థానికులకు కాకుండా స్థానికేతరులు నిర్వహిస్తున్నారని, రేషన్ షాపును స్థానికులకు అప్పగిస్తే ప్రజలకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందని, దరఖాస్తు సమర్పించారు. ఈ దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు విచారణ, చర్యల నిమిత్తం తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు. టేకులపల్లి మండలం మద్రాస్ తండా గ్రామానికి చెందిన శరభ నరసింహారావు, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా రుణ సహాయం కోసం దరఖాస్తు చేసుకున్నానని, తన దరఖాస్తు చాలా రోజులుగా పెండింగ్‌లో ఉందని, త్వరితగతిన దరఖాస్తును పరిశీలించి రుణం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. ఈ దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యల నిమిత్తం టేకులపల్లి ఎంపీడీవోకు ఎండార్స్ చేశారు. ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు, జోడిపంపుల వెనుక ప్రాంతానికి చెందిన ప్రజలు తమ ప్రాంతంలోని కొంత మంది ప్రభుత్వ ఆరడుగుల గల్లీని ఆక్రమించారని, దీంతో మున్సిపాలిటీ తాగునీటి పైపులైన్ ఏర్పాటుకు, అత్యవసర రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, గల్లీ ఆక్రమణలను తొలగించి సమస్యను పరిష్కరించాలని దరఖాస్తు సమర్పించారు. ఈ దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యల నిమిత్తం ఇల్లందు మున్సిపల్ కమిషనర్‌కు ఎండార్స్ చేశారు. ములకలపల్లి మండలం కమలాపురం గ్రామానికి చెందిన జక్కా యమున, కమలాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని చలమన్న నగర్‌లో అంగన్వాడీ ఆయా పోస్టు ఖాళీగా ఉండటంతో తాను దరఖాస్తు చేసుకున్నానని, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కూడా పూర్తయిందని, దరఖాస్తు చేసుకున్న వారిలో తానే మెరిట్ జాబితాలో ముందున్నానని పేర్కొంటూ తనకు అంగన్వాడీ ఆయా పోస్టు కల్పించాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. ఈ దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యల నిమిత్తం మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారికి ఎండార్స్ చేశారు. చర్ల మండలం కంటేపల్లి గ్రామానికి చెందిన గోలి గోపయ్య, కంటేపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 1లో తనకు ఎకరం ఏడు కుంటల వ్యవసాయ భూమి ఉందని, ఈ భూమి తనకు వారసత్వంగా సంక్రమించిందని తెలిపారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా గత కొన్ని సంవత్సరాలుగా భూమిలో వ్యవసాయం చేయకపోవడంతో బీడు భూమిగా మారిందని తెలిపారు . తన వద్ద ఉన్న భూమికి సంబంధించిన పత్రాలను పరిశీలించి, పట్టాదారు పాస్‌బుక్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. ఈ దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యల నిమిత్తం భద్రాచలం సబ్ కలెక్టర్‌కు ఎండార్స్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ చేతుల మీదుగా తెలంగాణ ఓపెన్ స్కూల్స్ సొసైటీ వాల్‌పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు రద్దు చేయొద్దు

**బూర్గంపహాడ్ లో బీఆర్ఎస్ శ్రేణుల నిరసన**





**బూర్గంపహాడ్,ఆగస్టు17, (ప్రజాజ్యోతి):** పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేయకూడదని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బూర్గంపహాడ్ మండల కేంద్రంలో సోమవారం నిరసన,ధర్నా నిర్వహించారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, స్థానిక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పిలుపుమేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.మాజీ జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసనలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.అనంతరం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల వివాహాలు తల్లిదండ్రులకు ఆర్థికంగా భారంగా మారకుండా గత ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను అమలు చేసిందన్నారు. ఈ పథకాల ద్వారా వేలాది కుటుంబాలకు వివాహ సమయంలో ఆర్థిక సహాయం అందిందని తెలిపారు.ప్రస్తుతం ఈ పథకాలపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వడంతో పాటు పథకాలను నిరంతరాయంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకుని పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులకు తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని కోరారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఎలాంటి జాప్యం లేకుండా పథకం ప్రయోజనం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఆడబిడ్డల సంక్షేమం విషయంలో బీఆర్ఎస్ ఎప్పుడూ ముందుంటుందని, పేద కుటుంబాల సమస్యల పరిష్కారం కోసం పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని శ్రీలత పేర్కొన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేయకుండా మరింత పటిష్టంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.కార్యక్రమంలో మండల నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులు, యువజన విభాగం నాయకులు, మండల మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ముసాయిదా ఓటర్ల జాబితా-2026 విడుదల

**జిల్లాలోని 1,127 పోలింగ్ కేంద్రాల్లో ముసాయిదా ఓటర్ల జాబితా వెల్లడి**

**ఓటర్లు తమ పేరు, వివరాలను తప్పనిసరిగా పరిశీలించాలి**

**సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలకు అవకాశం**

**అర్హ్వత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలి**

**జిల్లా కలెక్టర్ అంకిత్**



**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 17 ,(ప్రజాజ్యోతి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితా–2026ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అంకిత్ సోమవారం విడుదల చేశారు. జిల్లాలోని మొత్తం 1,127 పోలింగ్ కేంద్రాల్లో ప్రజల పరిశీలన కోసం ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించినట్లు ఆయన తెలిపారు. సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు కార్యాలయాల పరిధిలో కూడా ముసాయిదా ఓటర్ల జాబితా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు . జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 27 మండలాలు ఉన్నాయని, ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో 8,63,413 మంది జనరల్ ఎలక్టర్లు ఉన్నట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. వీరిలో 4,19,558 మంది పురుషులు, 4,43,805 మంది మహిళలు, 50 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారని వివరించారు. అదేవిధంగా 28 మంది ఎన్ఆర్ఐ ఎలక్టర్లు, 723 మంది సర్వీస్ ఓటర్లు నమోదై ఉన్నారని, అన్ని కేటగిరీలను కలిపి జిల్లాలో మొత్తం 8,64,164 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా 110–పినపాక (ST) నియోజకవర్గంలో 1,74,854 మంది జనరల్ ఎలక్టర్లు, 2 మంది ఎన్ఆర్ఐ ఎలక్టర్లు, 197 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. 111–ఇల్లెందు( ఎస్ టి) నియోజకవర్గంలో 1,94,860 మంది జనరల్ ఎలక్టర్లు, 4 మంది ఎన్ఆర్ఐ ఎలక్టర్లు, 274 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. 117–కొత్తగూడెం నియోజకవర్గంలో 2,15,639 మంది జనరల్ ఎలక్టర్లు, 14 మంది ఎన్ఆర్ఐ ఎలక్టర్లు, 152 మంది సర్వీస్ ఓటర్లు, 118–అశ్వారావుపేట( ఎస్ టి) నియోజకవర్గంలో 1,44,770 మంది జనరల్ ఎలక్టర్లు, 6 మంది ఎన్ఆర్ఐ ఎలక్టర్లు, 50 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నట్లు వివరించారు. 119–భద్రాచలం (ఎస్టి) నియోజకవర్గంలో 1,33,290 మంది జనరల్ ఎలక్టర్లు, 2 మంది ఎన్ఆర్ఐ ఎలక్టర్లు, 50 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో తమ పేరు ఉందో లేదో ప్రతి ఓటరు తప్పనిసరిగా పరిశీలించుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. ఓటరు పేరు జాబితాలో లేకపోవడం, ఓటరు వివరాల్లో ఏదైనా తప్పు లేదా పొరపాటు ఉండటం, అర్హత లేని వ్యక్తి పేరు ఓటర్ల జాబితాలో నమోదై ఉండటం వంటి అంశాలను గుర్తించినట్లయితే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై క్లెయిమ్‌లు, అభ్యంతరాలను 17.08.2026 నుంచి 16.09.2026 వరకు సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. నిర్ణీత గడువులో సంబంధిత ఈ ఆర్ వో / ఏ ఈ ఆర్ ఓ అధికారులకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను దాఖలు చేయవచ్చని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో పేరు చేర్పు, తొలగింపు లేదా వివరాల సవరణకు సంబంధించి అవసరమైన దరఖాస్తులను సంబంధిత ఈ ఆర్ వో / ఏ ఈ ఆర్ ఓ / బి ఎల్ ఓ లను సంప్రదించి సమర్పించాలని సూచించారు.అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా, ఓటర్ల వివరాలు ఎలాంటి తప్పులు లేకుండా ఉండేలా ఎన్నికల అధికారులు చర్యలు చేపడుతున్నారని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ముసాయిదా ఓటర్ల జాబితాను పరిశీలించి, అవసరమైన సందర్భాల్లో నిర్ణీత గడువులోగా క్లెయిమ్‌లు, అభ్యంతరాలను సమర్పించాలని ఆయన కోరారు.

## మర్కోడు ఆశ్రమ పాఠశాలలో వారధి, ఉద్దీపకం పుస్తకాల పంపిణీ



**ఆళ్ళపల్లి,ఆగస్టు17(ప్రజా జ్యోతి)** ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రత్యేక చొరవతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం 'వారధి', విద్యలో వెనుకబడిన విద్యార్థుల కోసం 'ఉద్దీపకం' పుస్తకాలను స్వయంగా రూపొందించి, ముద్రించి పాఠశాలలకు పంపించారు. ఈ పుస్తకాల వినియోగంపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 11, 12 తేదీల్లో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా సోమవారం మర్కోడు ఆశ్రమ పాఠశాలలో గ్రామపంచాయతీ సర్పంచ్ సుతారి రమాదేవి ఆధ్వర్యంలో విద్యార్థులకు వారధి, ఉద్దీపకం పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు విద్యలో రాణించాలని ఉపాధ్యాయులు సూచించారు.కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఈ. ముత్తయ్య, ఉపాధ్యాయులు బాలు, మధు, రవీందర్, నరేష్, లక్ష్మయ్య, రవి, మోహన్. ఎస్కే.పర్వీన్ పాల్గొన్నారు.

## అవార్డులు సాధించిన అధికారులకు సన్మానం



**చర్ల, ఆగస్టు 17:(ప్రజాజ్యోతి):** చర్ల మండలంలో ఉత్తమ సేవలు అందించి అవార్డులు పొందిన ఎంపీడీఓ ఈదయ్య, తహసీల్దార్ శ్రీనివాస్‌లను తుడుం దెబ్బ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉత్తమ ఎంపీడీఓగా అవార్డు పొందిన ఈదయ్య, ఉత్తమ ఏఈఆర్ఓగా గుర్తింపు పొందిన శ్రీనివాస్‌లను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యులు వాసం ముసలయ్య మాట్లాడుతూ చర్లలో విధులు నిర్వహిస్తూ జిల్లా స్థాయిలో ఉత్తమ ఎంపీడీఓగా గుర్తింపు పొందడం గర్వకారణమన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్న అధికారులు ఉండటం అభినందనీయమని పేర్కొన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్‌కు ఉత్తమ ఏఈఆర్ఓ అవార్డు రావడం సంతోషకరమన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూనేం వరప్రసాద్, సీనియర్ నాయకులు తాటి వెంకటరావు, మండల యువ నాయకులు పూనేం రవికిరణ్, పురిటి ప్రశాంత్, ఇర్ప అరుణ్‌తేజ్ తదితరులు పాల్గొన్నారు.

## గోండ్వానా పరిషత్ ఆధ్వర్యంలో పాదయాత్ర




**చర్ల, ఆగస్టు 17:(ప్రజా జ్యోతి):** గోండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రను ఉభయ రాష్ట్రాల కన్వీనర్ సోందే వీరయ్య సోమవారం ప్రారంభించారు. తొలుత అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం పాదయాత్రను ప్రారంభించారు. ఈ పాదయాత్రను విజయవంతం చేసేందుకు యువత పెద్ద సంఖ్యలో పాల్గొని సహకరించాలని ఆయన కోరారు.ఈ సందర్భంగా సోందే వీరయ్య మాట్లాడుతూ భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలనే డిమాండ్ తో గత కొంతకాలంగా ఉద్యమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. షెడ్యూల్డ్ ప్రాంత చట్టాలను డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని అధికారులు తూచా తప్పకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఆదివాసీ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు.ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీ చట్టాలు పక్కాగా అమలయ్యేలా జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ, భద్రాచలం సబ్ కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో అనేక ఆదివాసీ భూములు అన్యాక్రాంతమయ్యాయని వాటిని గుర్తించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ పాదయాత్రకు ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనేం నాగేశ్వరరావు, శెట్టిపల్లి సత్యనారాయణ, జిల్లా వైస్ ప్రెసిడెంట్ కుంజ లక్ష్మయ్య, పూనేం కిరణ్ సంఘీభావం తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనేం సాయి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కల్లూరు కిషోర్, జిల్లా అధ్యక్షులు బీరబోయిన శేఖర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గొంది లీలాప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి బోరబోయిన అరుణ, మండల అధ్యక్షులు ఇరుప అంజిబాబు, డివిజన్ అధ్యక్షులు పాయం సన్యాసి, సున్నం సుబ్బయ్య, కారం సాయమ్మ, కారం సుధా, మడకం లలిత, వంజం ఇదేమి, రవ్వ పొజ్జా, పొడియం కోష, మడకం ఉంగ తదితరులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజావాణిలో ఫిర్యాదు.. తక్షణమే స్పందించిన ఎంపీడీవో

**వార్డు మెంబర్ గౌతమి,కాంగ్రెస్ నాయకులు చిప్పా రాజు చొరవతో బోరింగ్ మరమ్మతులు పూర్తి**



**బూర్గంపహాడ్,ఆగస్టు 17,(ప్రజా జ్యోతి):** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుపై ఎంపీడీవో కుదుముల జమలారెడ్డి తక్షణమే స్పందించడంతో సమస్యకు పరిష్కారం లభించింది. బూర్గంపహాడ్ మండల పరిధిలోని ఓ వార్డులో బోరింగ్ పనిచేయక ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ప్రజావాణి కార్యక్రమంలో అధికారులు దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించిన ఎంపీడీవో సంబంధిత సిబ్బందిని అప్రమత్తం చేసి బోరింగ్ మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు.బోరింగ్ పనిచేయకపోవడంతో తాగునీటి కోసం స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పిర్యాదు చేయగా వార్డు మెంబర్ గౌతమి, స్థానిక నాయకుడు చిప్పా రాజు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు నిత్యావసరమైన తాగునీటి సమస్య కావడంతో దీనిని అత్యవసరంగా పరిష్కరించాలని వారు కోరారు.ఫిర్యాదును స్వీకరించిన ఎంపీడీవో జమలారెడ్డి సమస్య తీవ్రతను తెలుసుకుని సంబంధిత సిబ్బందితో మాట్లాడారు. బోరింగ్ ను పరిశీలించి అవసరమైన మరమ్మతులు వెంటనే చేపట్టాలని ఆదేశించారు.కాగా వార్డు మెంబర్, నాయకులు చిప్ప రాజు సమక్షంలోనే అధికారులు,సిబ్బంది బోరింగ్ ను పరిశీలించి లోపాలను గుర్తించారు. అనంతరం అవసరమైన మరమ్మతులు చేపట్టి బోరింగ్ ను తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చారు. దీంతో స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.ప్రజలకు నిత్యావసరమైన తాగునీటి సమస్యపై వెంటనే స్పందించి మరమ్మతులు పూర్తి చేయించిన ఎంపీడీవో జమలారెడ్డికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## నవీన్ కుటుంబానికి అటవీ శాఖ భరోసా

**విధి నిర్వహణలో విద్యుత్ వేట ఉచ్చులకు తగిలి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మృతి**

**కుటుంబాన్ని పరామర్శించిన పీసీసీఎఫ్ వినయక ుమార్, సీసీఎఫ్ భీమానాయక్**

**భార్యకు ఉద్యోగం.. 500 గజాల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి హామీ**

**పిల్లల చదువులకు సహకరిస్తామని భరోసా**

**కొత్తగూడెం, ఆగస్టు 17, ప్రజా జ్యోతి :** విధి నిర్వహణలో విద్యుత్ వేట ఉచ్చులకు తగిలి మృతి చెందిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నవీన్ కుటుంబానికి అటవీ శాఖ అండగా నిలిచింది. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం వెంకట్యా తండాలోని నవీన్ కుటుంబాన్ని అటవీ శాఖ పీసీసీఎఫ్ వినయ్‌కుమార్, సీసీఎఫ్ భీమానాయక్ పరామర్శించారు. పాల్వంచ రేంజ్ పరిధిలోని బూర్గంపహాడ్ అటవీ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న సమయంలో విద్యుత్ వేట ఉచ్చులకు తగిలి నవీన్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికారులు ఆయన కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి, కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నవీన్ భార్యకు ఉద్యోగం కల్పించడంతో పాటు 500 గజాల ఇంటి స్థలం, ఇల్లు నిర్మాణానికి సహకారం అందిస్తామని పీసీసీఎఫ్ వినయ్‌కుమార్ హామీ ఇచ్చారు. నవీన్ పిల్లల చదువులకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన నవీన్ కుటుంబానికి అటవీ శాఖ అండగా ఉంటుందని, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.

## సాంకేతిక విద్యాశాఖను నిర్వీర్యం చేసే చర్యలా?

**పాలిటెక్నిక్‌ల విలీన ఆలోచనను విరమించుకోవాలి**

**జీవో నం.97ను రద్దు చేయాలి.. శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలి**

**ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్**



**కొత్తగూడెం, ఆగస్టు 17, ప్రజా జ్యోతి :** సాంకేతిక విద్యాశాఖను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం.. పాలిటెక్నిక్ కళాశాలలను ఇతర శాఖల్లో విలీనం చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి వరక అజిత్ డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను ప్రభావితం చేసే జీవో నంబర్ 97ను రద్దు చేయాలని, శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలని కోరారు. రుద్రంపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు సోమవారం తరగతులు బహిష్కరించి, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ విద్య పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను అందించే ప్రత్యేక వ్యవస్థ అని అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను ఇతర శాఖల్లో విలీనం చేయడం వల్ల సాంకేతిక విద్య వ్యవస్థపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ కళాశాలలు ప్రైవేటీకరణ దిశగా వెళ్తే పేద, మధ్యతరగతి విద్యార్థులకు తక్కువ ఖర్చుతో డిప్లొమా విద్య అందుబాటులో లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలను సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కొనసాగించాలని, కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయడంతో పాటు ప్రయోగశాలలను ఆధునికీకరించాలని, వర్క్‌షాప్‌లు, హాస్టళ్లను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. గతంలో సాంకేతిక విద్యా మండలిని విశ్వవిద్యాలయంగా అప్‌గ్రేడ్ చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయాన్ని అజిత్ గుర్తుచేశారు. అనంతరం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి, ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలను అందులో చేర్చాలనే ఆలోచన చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాలను వెనక్కి తీసుకోకపోతే విద్యార్థి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్, నాయకులు జయదీప్, అఫ్రాన్, మహేందర్, కళాశాల సమితి సభ్యులు కేతన్, రెజీనా, పల్లవి, రాజేష్, నవతన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో ప్రజా సమస్యలపై వినతి

**తునం దెబ్బ మండల కార్యదర్శి నరసింహ రావు**



**గుండాల ఆగస్టు 17 ప్రజా జ్యోతి** సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినట్లు మండల కార్యదర్శి గోవింద నరసింహారావు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరత లేకుండా చూడాలని, పెండింగ్ లో ఉన్న ఇందిరమ్మ బిల్లులు చెల్లించాలని, మండలంలో సిసి రోడ్లు నిర్మించాలని, యూరియా సరఫరా విషయంలో రైతుల ఎదుర్కొంటున్న ఇబ్బందులు పరిష్కరించాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో 24 గంటల వైద్య సేవలు కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన వినతులను సత్వరమే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు

## కార్మికుల సమస్యలను పరిష్కరించాలని భారతీయ మజ్దూర్ సంఘ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన

**ప్రజావాణిలో కలెక్టర్కు వినతి**

**కార్మికుల సమస్యల పరిష్కారమే బి ఎం ఎస్ లక్ష్యం**

**కనీస వేతనాలు, ఈపీ ఎఫ్– ఈ ఎస్ ఐ సి పరిమితుల పెంపు, కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయాలి**

**బి ఎం ఎస్ కన్వీనర్ బెజ్జం అశోక్**




**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 17 ,(ప్రజా జ్యోతి )** కార్మికుల సంక్షేమం, సామాజిక భద్రత, మెరుగైన వేతనాలు, ఉద్యోగ భద్రత కోసం భారతీయ మజ్దూర్ సంఘ్ నిరంతరం పోరాటం చేస్తోందని బి ఎం ఎస్ కన్వీనర్ బెజ్జం అశోక్ కో కన్వీనర్ పుచ్చకాయల లీలా కృష్ణ లు అన్నారు, కార్మికుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే విధంగా కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం బిఎమ్ఎస్ నాయకులు స్థానిక కలెక్టరేట్ కార్యాలయ మీదట నిరసన చేపట్టారు, అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్కు గ్రీవెన్స్ డే లో అందజేశారు ,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనాన్ని నెలకు 30,000కు పెంచాలని, ఈ ఎస్ ఐ సి వేతన పరిమితిని 21,000 నుంచి 42,000కు పెంచాలని డిమాండ్ చేశారు, అదేవిధంగా ఈపీఎఫ్ పరిమితిని 15,000 నుంచి 30,000కు పెంచాలన్నారు బోనస్‌కు సంబంధించిన వేతన పరిమితిని 7,000 నుంచి 18,000కు ఇవ్వాలని, బోనస్ అర్హతకు సంబంధించిన వేతన పరిమితిని 21,000 నుంచి 42,000కు పెంచాలనీ, కార్మికుల కనీస పెన్షన్‌ను 7,500తో పాటు కరువు భత్యం (డి ఎ) , వైద్య సదుపాయాలతో కలిపి పెంచాలన్నారు, కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం కల్పించాలనీ, లేబర్ కోడ్‌లలో కార్మిక వ్యతిరేక నిబంధనలను రద్దు రద్దు చేయాలని డిమాండ్ చేశారు, గ్రాట్యుటీ పరిమితిని 40 లక్షలకు పెంచాలని, బ్యాంకింగ్ రంగంలో వారానికి 5 రోజుల పనిదినాలను అమలు జరపాలని అసంఘటిత కార్మికుల సంక్షేమానికి సంబంధించిన ఈ డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు, కార్మికుల హక్కులు, సంక్షేమం, సామాజిక భద్రత కోసం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు,ఈ కార్యక్రమం లో బి ఎం ఎస్ నాయకులు కృష్ణ, ఆర్గనైజేషన్ చీఫ్ సెక్రటరీ పవన్ ఎస్ సి ఎం కె ఎస్ వైస్ ప్రెసిడెంట్ మొగిలిపాక రవి,సంగం చంద్రం,రాంబాబు, కేటీపీస్ పవర్ సెక్టార్ యూనియన్ గొర్రె వేణు గోపాల్, సత్యనారాయణ,రాజమౌళి గోడి రఘు షేకర్,సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మిపై భారాస సమరం

**జిల్లావ్యాప్తంగా నిరసనలు.. అశ్వారావుపేటలో తహసీల్దార్ కార్యాలయం ముట్టడి**

**ఇల్లెందులో వేర్వేరుగా ఆందోళనలు.. పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్**

**హామీలను నెరవేర్చకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరిక**





**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఆగస్టు 17, ప్రజా జ్యోతి :** కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపిస్తూ భారాస శ్రేణులు జిల్లావ్యాప్తంగా నిరసనలకు దిగాయి. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ ఇచ్చిన పిలుపులో భాగంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో నాయకులు, కార్యకర్తలు ఆందోళనలు నిర్వహించారు. పథకాల అమలును వెంటనే చేపట్టాలని, అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు.

**అశ్వారావుపేటలో తహసీల్దార్ కార్యాలయం ముట్టడి**

అశ్వారావుపేటలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు నాయకత్వంలో భారాస నాయకులు, కార్యకర్తలు తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా నిర్వహించారు. కళ్యాణలక్ష్మి పథకాన్ని తక్షణమే అమలు చేయాలని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యాలయం ఎదుట పెద్ద సంఖ్యలో కార్యకర్తలు నిరసన చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కళ్యాణలక్ష్మి పథకం అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆరోపించారు. కోర్టు వ్యవహారాలను సాకుగా చూపుతూ అర్హులైన లబ్ధిదారులను ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే కళ్యాణలక్ష్మి పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన తులం బంగారం హామీని కూడా అమలు చేయాలని ఆయన కోరారు. కళ్యాణలక్ష్మి పథకం అమలు, ఎన్నికల హామీల సాధన కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

**ఇల్లెందులో వేర్వేరుగా నిరసనలు..**

ఇదే అంశంపై ఇల్లెందులోనూ భారాస శ్రేణులు నిరసన కార్యక్రమాలు నిర్వహించాయి. మాజీ ఎమ్మెల్యే హరిప్రియ వర్గీయులు ఒకచోట నిరసన చేపట్టగా.. భారాస పార్టీ వ్యవస్థాపక సభ్యుడు రాజేందర్ ఆధ్వర్యంలో మరో కార్యక్రమం నిర్వహించారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను నిలిపివేయడం లేదా అమలులో జాప్యం చేయడం వల్ల పేద కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని నాయకులు పేర్కొన్నారు. వివాహం చేసుకునే ఆడపిల్లల కుటుంబాలకు ఆర్థికంగా అండగా ఉండే ఈ పథకాల విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**జిల్లావ్యాప్తంగా రాజకీయ వేడి**

రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లెందు, అశ్వారావుపేట ప్రాంతాల్లో భారాస శ్రేణులు చేపట్టిన ఆందోళనలతో సంక్షేమ పథకాల అంశం మరోసారి రాజకీయ చర్చకు దారితీసింది. ఒకవైపు తహసీల్దార్ కార్యాలయం ముట్టడి, మరోవైపు వేర్వేరు నిరసన కార్యక్రమాలతో భారాస నాయకులు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే ప్రయత్నం చేశారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని, పెండింగ్ లో ఉన్న లబ్ధిదారులకు నిధులు విడుదల చేయాలని భారాస శ్రేణులు డిమాండ్ చేస్తున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు పేద కుటుంబాలకు అందాల్సిన సంక్షేమ ప్రయోజనాలను సకాలంలో అందించాలని కోరుతున్నాయి. అయితే పథకాల అమలుపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఇప్పుడు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

# పెళ్లి పేరుతో తీసుకెళ్లి దాడి చేశాడా?

**న్యాయం కోసం యువతి కుటుంబ సభ్యుల ధర్నా.**



**పాల్వంచ, ఆగస్టు 17, ప్రజాజ్యోతి:** పాల్వంచ మండలం కిన్నెరసాని రూరల్ పరిధిలోని ఓ గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. తనను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి తీసుకెళ్లి, అనంతరం లైంగిక దాడికి పాల్పడి, పెళ్లికి నిరాకరించాడని ఓ యువతి ఆరోపిస్తోంది. తనకు న్యాయం చేయాలని కోరుతూ బాధితురాలు కుటుంబ సభ్యులతో కలిసి యువకుడి ఇంటి వద్ద ఆందోళనకు దిగింది. బాధితురాలు, యువకుడు గత రెండేళ్లుగా ప్రేమలో ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో పెళ్లి చేసుకుంటానని చెప్పి యువకుడు ఆమెను పుల్లయ్యగూడెం పరిధిలోని డంపింగ్ యార్డ్ ప్రాంతానికి తీసుకెళ్లినట్లు యువతి కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అక్కడ తనపై లైంగిక దాడికి పాల్పడినట్లు యువతి ఆరోపించింది. అనంతరం పెళ్లి చేసుకోనని చెప్పడంతో పాటు తనపై దాడి చేసి కొట్టినట్లు కుటుంబ సభ్యులకు తెలిపింది. తీవ్ర ఆవేదనకు గురైన యువతి అక్కడి నుంచే కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తనను తీసుకెళ్లాలని కోరినట్లు వారు వెల్లడించారు. కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకునేలోపే యువకుడు అక్కడి నుంచి వెళ్లిపోయాడని, సుమారు రాత్రి 1 గంట సమయంలో అతను పరారైనట్లు వారు ఆరోపించారు. అప్పటి నుంచి అతని ఆచూకీ తెలియడం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు.

**నాకు అతనే కావాలి.. పెళ్లి చేసుకుంటానన్నాడు**

తనను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి తీసుకెళ్లిన వ్యక్తే ఇప్పుడు తనను వదిలిపెట్టాడంటూ యువతి కన్నీటి పర్యంతమైంది. “నన్ను పెళ్లి చేసుకుంటానని చెప్పి తీసుకెళ్లాడు. ఇప్పుడు నాకు న్యాయం చేయాలి” అంటూ కుటుంబ సభ్యులతో కలిసి యువకుడి ఇంటి వద్ద ఆందోళనకు దిగింది.

తనకు న్యాయం జరిగే వరకు అక్కడి నుంచి కదిలేది లేదని యువతి కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు సమగ్రంగా విచారణ జరిపి, యువతి చేసిన ఆరోపణలపై నిజానిజాలను వెలుగులోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.

**పోలీసుల విచారణతోనే నిజానిజాలు వెలుగులోకి**

ఆరోపణలు నిజమా కాదా అన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. యువతి ఆరోపణలపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితురాలికి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రేమ పేరుతో మోసం.. ప్రియుడి ఇంటి ముందు ధర్నా

**పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగిక దాడికి పాల్పడ్డాడని యువతి ఆరోపణ**

**ఇంటికి వెళ్లి ఆందోళన.. పోలీసుల సమక్షంలో ఇరువర్గాల విచారణ**





**పాల్వంచ, ఆగస్టు 17, ప్రజా జ్యోతి:** ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనపై లైంగిక దాడికి పాల్పడి, అనంతరం పెళ్లికి నిరాకరించాడని ఆరోపిస్తూ ఓ యువతి ప్రియుడి ఇంటి ఎదుట ఆందోళనకు దిగిన ఘటన పాల్వంచ మండలంలో కలకలం రేపింది. బాధితురాలి ఆరోపణల మేరకు పోలీసులు ఇరువర్గాలను కిన్నెరసాని రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. బాధితురాలు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ మండలంలోని రాజాపురం గ్రామానికి చెందిన వజ్జ వనిత, కోడిపుంజుల గ్రామానికి చెందిన భూక్యా అభిరామ్ గత రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో పెళ్లి చేసుకుంటానని నమ్మించి అభిరామ్ తనను పుల్లయ్యగూడెం పరిధిలోని డంపింగ్ యార్డు సమీపానికి తీసుకెళ్లాడని యువతి ఆరోపించింది. అక్కడ తనపై లైంగిక దాడికి పాల్పడటంతో పాటు, అనంతరం పెళ్లి చేసుకోనని చెబుతూ తనపై దాడి చేశాడని వనిత ఆరోపించింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సమాచారం అందించింది. కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకునేలోపే రాత్రి సుమారు ఒంటి గంట సమయంలో అభిరామ్ అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు వారు తెలిపారు. దీంతో బాధితురాలు కుటుంబ సభ్యులతో కలిసి అభిరామ్ ఇంటి ఎదుట ఆందోళనకు దిగింది. తనను పెళ్లి చేసుకుని న్యాయం చేయాలని, సమస్య పరిష్కారం అయ్యే వరకు ధర్నా విరమించేది లేదని ఆమె బైఠాయించింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలితో మాట్లాడారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చి ఇరువర్గాలను కిన్నెరసాని రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. కాగా యువతి ఆరోపణలు ఎదుర్కొంటున్న యువకుడి తండ్రి పోలీస్ శాఖలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే ఈ ఘటనపై పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి వాస్తవాలను నిర్ధారించాల్సి ఉంది. బాధితురాలి ఆరోపణలపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకుంటారనేది పోలీసుల విచారణ అనంతరం స్పష్టంకానుంది.

# వెలుగుల కోసం అశ్వాపురం ఎదురుచూపులు!

**రోడ్లు, డివైడర్లు సిద్ధమైనా.. సెంట్రల్ లైటింగ్ పనులకు మాత్రం మోక్షమెప్పుడు?**



**అశ్వాపురం:** మండల కేంద్రంలో రహదారుల విస్తరణ, డివైడర్ల నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నా సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు కాకపోవడంతో రాత్రివేళల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో అశ్వాపురం సెంట్రల్ లైటింగ్ కోసం సుమారు రూ.4 కోట్ల నిధులు మంజూరైనట్లు స్థానికులు చెబుతున్నప్పటికీ, ఇప్పటి వరకు పనులు ముందుకు సాగకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**రాత్రివేళల్లో చీకట్లే..**

ప్రధాన రహదారుల విస్తరణతో పాటు డివైడర్లు ఏర్పాటు చేయడంతో అశ్వాపురం సెంటర్ రూపురేఖలు మారాయి. అయితే రాత్రివేళల్లో తగినంత వెలుతురు లేకపోవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన కూడళ్లు, డివైడర్ల వద్ద లైటింగ్ లేకపోవడం వల్ల ప్రమాదాల ముప్పు కూడా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**కోట్ల నిధులు.. కదలని పనులు**

సెంట్రల్ లైటింగ్ కోసం నిధులు మంజూరైనట్లు చెబుతున్న నేపథ్యంలో పనుల్లో జాప్యానికి కారణాలేమిటో అధికారులు వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు. రోడ్లు, డివైడర్లు పూర్తయిన తర్వాత కూడా లైటింగ్ ఏర్పాటు చేయకపోవడంతో కోట్ల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులు అసంపూర్తిగా కనిపిస్తున్నాయని అంటున్నారు.

**ఇకనైనా చర్యలు తీసుకోవాలి**

అశ్వాపురం కేంద్రంలో నిత్యం పెరుగుతున్న వాహనాల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని సెంట్రల్ లైటింగ్ పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిధుల ప్రస్తుత పరిస్థితి, పనుల పురోగతి, పూర్తయ్యే గడువుపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. ప్రజల భద్రతకు సంబంధించిన ఈ సమస్యను ఇకనైనా అధికారులు అత్యవసరంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ‘పొంగులేటి’ అభయం.. నిరుద్యోగులకు ‘రైట్ ఛాయిస్’

**పోలీస్ కొలువు లక్ష్యంగా.. ఉచిత శిక్షణ**

**ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం యువతకు ‘పొంగులేటి’ అవకాశం..**

**ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఉచిత కోచింగ్**

**నిపుణులైన ఫ్యాకల్టీతో శిక్షణ.. మాక్ టెస్టులు, స్టడీ మెటీరియల్ ఉచితం..**

**గతంలో ఒకే బ్యాచ్‌లో 344 మంది ఉద్యోగాలు సాధించిన రికార్డు..**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఆగస్టు 17, ప్రజాజ్యోతి :** పోలీస్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నిరుద్యోగ యువతకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రంలో ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల నోటిఫికేషన్ల నేపథ్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అభ్యర్థుల కోసం ఖమ్మం, కొత్తగూడెం పట్టణాల్లో ఉచిత శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఉచిత శిక్షణకు సంబంధించిన పోస్టర్‌ను క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో పొంగులేటి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత శిక్షణ ద్వారా పలువురు అభ్యర్థులు పోలీస్ ఉద్యోగాలు సాధించారని గుర్తు చేశారు. ఈసారి కూడా హైదరాబాద్‌కు చెందిన నిపుణులైన ఫ్యాకల్టీతో నాణ్యమైన శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులకు ప్రతి రోజూ మాక్ టెస్టులు, ఉచితంగా ముద్రిత స్టడీ మెటీరియల్, వారానికో సారి గ్రాండ్ టెస్టులు నిర్వహించనున్నట్లు చెప్పారు. రైట్ ఛాయిస్ అకాడమీ చైర్మన్ మెండెం కిరణ్‌కుమార్ నేత ృత ్వంలో శిక్షణ కొనసాగనుంది. 2016లో పొంగులేటి–రైట్ ఛాయిస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత శిక్షణలో ఒకే బ్యాచ్ నుంచి 326 మంది కానిస్టేబుళ్లు, 18 మంది ఎస్ఐలు కలిపి మొత్తం 344 మంది ఉద్యోగాలు సాధించారని కిరణ్‌కుమార్ తెలిపారు. పోలీస్ ఉద్యోగం సాధించాలనే పట్టుదల ఉన్న ప్రతి అభ్యర్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఆర్థికంగా వెనుకబడిన, ప్రైవేట్ కోచింగ్‌కు వెళ్లలేని నిరుద్యోగ యువతకు ఈ ఉచిత శిక్షణ ఉపయోగపడనుంది. ముఖ్యంగా ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. ఉచిత శిక్షణకు నమోదు చేసుకోవాలనుకునే ఖమ్మం జిల్లా అభ్యర్థులు 8985095599, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభ్యర్థులు 8985096699 నంబర్లకు తమ పేరు, ఫోన్ నంబర్, గ్రామం, మండలం, నియోజకవర్గం వివరాలను వాట్సాప్ ద్వారా పంపి ఉచిత శిక్షణకు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

## ప్రజా సమస్యలకు వేదికగా ప్రజావాణి

**13 శాఖల అధికారుల హాజరు.. నాలుగు దరఖాస్తుల స్వీకరణ**





**అశ్వాపురం, అగస్ట్ 17,ప్రజాజ్యోతి** అశ్వాపురం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఉన్న రైతు వేదికలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో ముత్యాల రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మండలంలోని 13 శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై ప్రజలు అధికారులను కలిసి తమ సమస్యలను వివరించారు. మొత్తం నాలుగు దరఖాస్తులు అధికారులకు అందాయి. దరఖాస్తులను స్వీకరించిన అధికారులు వాటిని పరిశీలించి సంబంధిత శాఖల పరిధిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావడానికి ప్రజావాణి కార్యక్రమం ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అన్నపురెడ్డిపల్లి మండలంలో ప్రజావాణి కార్యక్రమం

**ప్రజల సమస్యలపై అర్జీల స్వీకరణ.. ఇందిరమ్మ ఇంటి కోసం వినతి**





**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 17 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద సోమవారం ఎంపీడీవో డి. రాజేశ్వరి ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ స్వర్ణతో పాటు వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు హాజరై ప్రజలకు అందుబాటులో ఉన్నారు. పలువురు ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేసి పరిష్కారం కోసం అధికారులను సంప్రదించారు. ఊటుపల్లి గ్రామానికి చెందిన సడియం వెంకటలక్ష్మి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ అందజేశారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ సమస్యలపై సంబంధిత అధికారులను కలిసి పరిష్కారం పొందాలని ఎంపీడీవో డి. రాజేశ్వరి తెలిపారు.

# ఎరువుల కోసం.. రైతుల ఎదురుచూపులు

**జిల్లావ్యాప్తంగా ఫెర్టిలైజర్ యాప్ సమస్యతో రైతుల అవస్థలు**

**మొరాయిస్తున్న యాప్..**

**రిజిస్ట్రేషన్ కాక.. ఎరువుల కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు**

**సమస్య పరిష్కరించకుంటే ఆందోళనకు సిద్ధమంటున్న రైతులు**

**సేవాలాల్ బంజారా సంఘం ఆధ్వర్యంలో నిరసనకు సన్నాహాలు**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఆగస్టు 17, ప్రజాజ్యోతి :** పంటల సాగు సమయం దగ్గరపడుతున్న వేళ ఎరువుల కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారనే ఫిర్యాదులు జిల్లావ్యాప్తంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఫెర్టిలైజర్ యాప్ రిజిస్ట్రేషన్‌లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలు రైతులకు తలనొప్పిగా మారాయి. యాప్‌ను ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకున్నప్పటికీ రిజిస్ట్రేషన్ పూర్తి కాకపోవడంతో ఎరువులు పొందేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాలతో పాటు కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్, కొత్తగూడెం, పాల్వంచ ప్రాంతాల్లోనూ పలువురు రైతులు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. ఇప్పటికే పత్తి పంట వేసి, వరి పంటలకు ఎరువులు వేసే సమయం సమీపిస్తుండటంతో రిజిస్ట్రేషన్ సమస్య మరింత ఆందోళనకు గురిచేస్తోందని పేర్కొంటున్నారు. సమస్యపై వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదిస్తున్నా.. యాప్ ఇన్‌స్టాల్ చేసుకుని కొంత సమయం వేచి ఉండాలని సూచిస్తున్నారని రైతులు చెబుతున్నారు. అయితే ఈ సమస్యపై సేవాలాల్ బంజారా సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, జీఎల్ఎస్ అండ్ జేఏసీ జాయింట్ సెక్రటరీ బానోత్ శ్రీనివాస్ నాయక్ స్పందించారు. రైతు వద్దకే పాలన అంటున్న ప్రభుత్వం.. రైతులు మాత్రం అధికారుల కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడంతో పాటు ఫెర్టిలైజర్ యాప్ రిజిస్ట్రేషన్ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని రైతుల సమస్యను తక్షణమే పరిష్కరించకుంటే రైతాంగం తరఫున ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని శ్రీనివాస్ నాయక్ హెచ్చరించారు. రైతులకు సకాలంలో ఎరువులు అందకపోతే పంటలపై ప్రభావం పడే అవకాశం ఉందని, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని కోరారు. అయితే జిల్లావ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న ఫెర్టిలైజర్ యాప్ సమస్యపై వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేపట్టి స్పష్టమైన పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది.

## గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం



**ములకలపల్లి, ఆగస్టు 17 (ప్రజాజ్యోతి):** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. సోమవారం ములకలపల్లి మండలంలో పర్యటించిన వారు ముత్యాలంపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించి ప్రజల వినియోగానికి అంకితం చేశారు. అనంతరం పాతగంగారం గ్రామపంచాయతీ పరిధిలోని పాలవాగులో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఎంపీ, ఎమ్మెల్యేలను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ స్వాతిబిందు, ఎంపీడీవో సత్యనారాయణ, ఏవో అరుణ్ బాబు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జహీరుద్దీన్, ముత్యాలంపాడు సర్పంచ్ కల్లూరి కిషోర్, పాతగంగారం సర్పంచ్ సోడె చైతన్య, సీతారాంపురం సర్పంచ్ కుంజా రవి, రాచన్నగూడెం సర్పంచ్ మడకం విజయ, కాంగ్రెస్ నాయకులు కారం సుధీర్, గాడి తిరుపతిరెడ్డి, తాండ్ర ప్రభాకరరావు, పెటేటి నరసింహారావు, కొప్పుల రాంబాబు, మడకం చిరుమప్ప, పాలకుర్తి సుమిత్, గుంట్రూ సాయి, సురభి రాజేష్, జానీ, పాలకుర్తి రవి, మీడియం నారాయణ, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సీతక్క ఆశయాల సాధనకు కృషి చేస్తాం



**ములకలపల్లి ఆగస్టు 17 (ప్రజాజ్యోతి):** ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం సీతక్క ఆశయాలను కొనసాగిస్తూ పోరాడతామని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు తెలిపారు. సోమవారం ముత్యాలంపాడు గ్రామంలో ఈసం వెంకన్న అధ్యక్షతన సీతక్క సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం జిల్లా నాయకులు ఎస్ .కే. ఉమర్, మండల కార్యదర్శి కుంజ కృష్ణ మాట్లాడుతూ.. ఆదివాసీల హక్కులు, పోడు భూముల రక్షణ కోసం గంగసాని వీరయ్య ధర్మన్న, సీతక్క చేసిన పోరాటం మరువలేనిదన్నారు. సీతక్కకు విప్లవ జోహార్లు అర్పించి, ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చంటి, సీతారాములు, వీరస్వామి, రాఘవులు, ఈసం పార్వతి, పద్మ, రమణ, లలిత, ఇంటిక లక్ష్మి, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 18 దరఖాస్తులు



**ములకలపల్లి, ఆగస్టు 17(ప్రజాజ్యోతి):** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ సమస్యలపై ప్రజల నుంచి మొత్తం 18 దరఖాస్తులు అందాయి. అధికారులు దరఖాస్తులను స్వీకరించి, సమస్యలను పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, తహసీల్దార్ స్వాతిబిందు, ఎలక్ట్రికల్ ఏఈ నరేష్, వ్యవసాయ అధికారి అరుణ్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరప్రసాద్, ఎంఈవో సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సామ్రాజ్యం, జ్ఞానసుందరి, ఎంపీవో రమేష్‌బాబు, హౌసింగ్ ఏఈ శ్రీధర్, బీసీ వెల్ఫేర్ వార్డెన్ శ్రీనివాసరావు, ఆరోగ్యశాఖ హెల్త్ సూపర్‌వైజర్ శ్రీకృష్ణ, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, పశువైద్యాధికారి రామకృష్ణ, ఇరిగేషన్ ఏఈ తదితరులు పాల్గొన్నారు.